పడకేసిన పారిశుద్ధ్యం

- మురికి కూపంగా లింగవరం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

గుడివాడరూరల్: మండలంలోని లింగవరం గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలో ఎటు చూసినా చెత్త దర్శనమిస్తోంది. గ్రామం మురికి కూపంగా మారినా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో ఒకటైన లింగవరం గుడివాడ పట్టణాన్ని ఆనుకుని ఉంటుంది. మున్సిపాల్టీలో విలీనం ప్రక్రియలో భాగంగా ఏర్పడిన వివాదం నేపథ్యంలో కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. దీంతో గతంలో పంచాయతీ ఎన్నికలు గ్రామంలో నిర్వహించలేదు.

రోడ్ల వెంబడే చెత్త

కొంతకాలంగా సమస్యలు పేరుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని అంతర్గత రోడ్లు, వీధులు చెత్తతో నిండిపోతున్నాయి. ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాల్సిన పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామంలో రోడ్ల వెంబడి చెత్త వేయడంతో ఇటీవల కురిసిన వర్షాలతో విపరీతంగా దోమలు విజృంభిస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు అల్లాడుతున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారీ చేయకపోవడంతో దోమల బెడద వేధిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో మాదిరిగానే గ్రామాల్లోనూ చెత్తను సేకరించేందుకు వాహనాలు, ప్రత్యేక సిబ్బందిని పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడంలో వీధులు, రోడ్లు శుభ్రంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం



లింగవరం ఆర్‌బీకే రోడ్డులో పేరుకుపోయిన చెత్త

అధికారంలోకి వచ్చాక అధికారుల నిర్లక్ష్యంతో రహదారుల వెంబడి చెత్త పేరుకుపోయి మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి.

బెంబేలెత్తిస్తున్న వ్యాధులు

గ్రామంలో పారిశుద్ధ్య పనులు అటకెక్కడంతో అంటు వ్యాధులు గ్రామస్తులను బెంబేలెత్తిస్తున్నాయి. దోమలు స్వైర విహారం చేయడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. జ్వరాలు, దగ్గు, జలుబు తదితర వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్లు తెరచి గ్రామంలో ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని పంచాయతీ అధికారి

గ్రామానికి ఏళ్ల తరబడి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శే విధులు నిర్వహించడంతో పాలన పక్కదారి పడుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పలు సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లినా కనీసం చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. రెండు వారాలకు ఒకసారి మాత్రమే పంచాయతీ కార్యాలయానికి అధికారి వస్తారని, ఎవరైనా గ్రామస్తులు అడిగితే తాను ఇంకా మూడు పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్నానని, పనిభారంతో ఇబ్బంది పడుతున్నానని అంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ పంచాయతీకి రెగ్యులర్ అధికారిని నియమించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బ్రహ్మారెడ్డి కాలనీ వద్ద చెత్తతో నిండిపోయిన కుండీ

సమస్యల పరిష్కారానికి చర్యలు

గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతా. గతంలో చెత్త తొలగింపునకు ఇద్దరు ఉండేవారు. వీరిలో ఒక వ్యక్తి ఇటీవల మరణించాడు. త్వరలోనే మరొకరిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే పంచాయతీలో నిధుల కొరత కారణంగా కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారిస్తా.

– బీవై విష్ణుప్రసాద్, ఎంపీడీఓ

చెత్త తొలగించే వారే లేరు



మా గ్రామంలో చెత్త తొలగించే వారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఇంటింటికీ చెత్త సేకరణ చేసేవారు. ప్రస్తుతం చేయడం లేదు. దీంతో వీధుల్లో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

– అత్తులూరి సీతాదేవి, లింగవరం గ్రామం

దోమలతో అల్లాడుతున్నాం



ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామంలో దోమల బెడద అధికంగా ఉంది. రాత్రి సమయాల్లో దోమలతో అల్లాడుతున్నాం. ఇంత వరకు దోమ మందు పిచికారీ చేయలేదు. వర్షాలు వచ్చిన సమయంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు అధికంగా ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– కోట లచ్చమ్మ, లింగవరం గ్రామం

క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పద్మ



గుడ్లవల్లేరు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగాపురం పద్మను నియమించారు. ఈ విషయాన్ని ఆమె సోమవారం విలేకరులకు తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తనను నియమించినందుకు ఆయనకు ఖ్యాతి తెచ్చి పెట్టే విధంగా బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ‘పాడి కోసం-పౌష్టికాహారం’

చినముత్తేవి(మొవ్వ): రైతు బాంధవుడు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మొవ్వ మండలం చినముత్తేవిలో పాడి కోసం- పౌష్టికాహారం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యారా సాయి ప్రశాంత్ చినముత్తేవిలోని పాడి రైతులకు ఉచితంగా పౌష్టికాహారంగా ఐదు కేజీల తెలగపిండి, లీటర్ కాల్షియం బాటిల్ అందించనున్నారు. గ్రామంలోని శివాలయం వద్ద 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హాజరుకానున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలో మూడు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, ఆలయాల మధ్య బార్‌లు వద్దు




గుడివాడ టౌన్: స్థానిక నాగవరప్పాడు వంతెన వద్ద బార్ ఏర్పాటు చేయడాన్ని నిలుపుదల చేయాలని సోమవారం స్థానిక మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. వంతెనకు సమీపంలో నివాసాల మధ్య, దాసాంజనేయ గుడి ఎదురుగా బార్ ఏర్పాటు చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ స్థానిక ఏలూరు రోడ్‌లో మహిళలు ధర్నా చేశారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తీసుకెళ్లగా ఆయన బార్ ఏర్పాటు చేయకుండా చూస్తానని హామీ ఇచ్చారని మహిళలు తెలిపారు.

గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళులు



గుడివాడ టౌన్: తెలుగు భాషా పరిరక్షకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సోమవారం నిర్వహించారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని దేవరకొండ నాగన్న సత్రంలో తెలుగుభాషా వికాస సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అతిథిగా రామ్మూర్తి పంతులు వారసులు గిడుగు నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. అనంతరం గిడుగు నాగేశ్వరరావును గిడుగు పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, సయ్యద్ గఫార్, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: టాటా బిల్డింగ్ ఇండియా హైదరాబాద్ శాఖ రాజేంద్రనగర్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యాలయ విద్యార్థులు పతకాలు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ బి. విజయ్‌భాస్కర్ సోమవారం తెలిపారు. ‘ఫైవ్ థింగ్స్ ఐ విల్ డు టు బిల్డ్ ఏ సెల్ఫ్ రిలయంట్ ఇండియా’ అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు డి. మెర్సి ప్రియ, షేక్ జహదాకుసూమ్, ఎస్. లయక్ షాన్‌లు ప్రథమ, వై. సాయిశ్రీ శాన్వీ, ఇ. సాయి పునీత్, ఎం. వంశీ సోమేష్‌లు ద్వితీయ, బి. ఆశా కీర్తన, బి. యశ్వంత్‌లు తృతీయ బహుమతులు సాధించారన్నారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి
- డీఎన్నార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన సభలో మాట్లాడుతున్న దివంగత వైఎస్సార్ (ఫైల్)

కైకలూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల గుండె చప్పుడుగా నిలిచిపోయారు. ఆయన రాష్ట్ర ప్రజలకు ఒక ధైర్యం, ఆత్మవిశ్వాసం. ఆయన మరణించినా 108, 104 వాహనాల కుయ్.. కుయ్ అనే శబ్దాలతో పలకరిస్తూనే ఉంటారు. ఆరోగ్యశ్రీ, వృద్ధులకు పెన్షన్, రైతులకు ఉచిత విద్యుత్, పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ముస్లింలకు రిజర్వేషన్ ఇలా మరెన్నో పథకాలను ప్రవేశపెట్టి ఆదర్శంగా నిలిచారు. ఆయన వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు మంగళవారం నిర్వహించనున్నారు.

నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కైకలూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించేవారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి ఆయన వచ్చారు. అదేవిధంగా బస్సు యాత్రలో భాగంగా నియోజకవర్గంలో పర్యటించారు. ఇక కొల్లేరు ప్రజల చిరకాల కలగా మిగిలిన సర్కారు కాల్వపై వారధి నిర్మాణానికి రూ.12 కోట్లు వైఎస్సార్ కేటాయించారు. ఆయన మరణానంతరం పనులు నిలిచాయి. తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వారధి నిర్మాణాన్ని అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పూర్తి చేశారు. ప్రత్యేక జీఓ ద్వారా ఫైర్ స్టేషన్ సమీప ఎస్సీ కాలనీలో ప్రజలకు ఇంటి స్థలాలు అందించారు.

వర్ధంతి కార్యక్రమాలు ఇలా..

వైఎస్ వర్ధంతి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) మంగళవారం పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. కైకలూరు సంతమార్కెట్ వద్ద 27 అడుగుల వైఎస్సార్ విగ్రహం వద్ద క్షీరాభిషేకం కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఏలూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పలు సేవా కార్యక్రమాలు జరగనున్నాయి.

ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వి.వి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థులు క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ చోడవరంలో నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాల్లో బీఫార్మసీ నాల్గో సంవత్సరం చదువుతున్న ఎస్.జయశ్రీ, వి.భావన క్యారమ్స్ డబుల్స్‌లో రెండో స్థానంలో నిలిచారన్నారు. సాంస్కృతిక పోటీల్లో భాగంగా నిర్వహించిన జానపద నృత్య ప్రోటీల్లో బీఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న ఝాన్సీలక్ష్మి, వై.లక్ష్మీ శరణ్య, పి.జాఫ్రిన్, ఎస్.లావణ్య, పి.స్వప్నిక, జె.హనీషా, ఆర్.గాయత్రి అద్భుత ప్రదర్శన కనబరిచి రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలు బహూకరించినట్లు పేర్కొన్నారు. విజేతలకు శిక్షణ ఇచ్చిన స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ టి.బాలకృష్ణ, కల్చరల్ ఇన్‌చార్జి డాక్టర్ వి.రజిని, అధ్యాపకురాలు టి.కుందనాను ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చోరగుడి-గోపాలకృష్ణాపురం రోడ్డుకు మోక్షమెప్పుడో?



గుంతలమయంగా మారిన చోరగుడి-గోపాలకృష్ణాపురం రోడ్డు

పమిడిముక్కల: చోరగుడి నుంచి గోపాలకృష్ణాపురం వెళ్లు రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డంతా గుంతలు పడి, రాళ్లు లేచి ప్రమాదకరంగా ఉంది. 25 ఏళ్ల కిందట ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులతో రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. చోరగుడి, అలీనఖీపాలెం గ్రామాల నుంచి నిత్యం విద్యార్థులు, చేతివృత్తుల వారు ఈ రహదారి పైనుంచి మొవ్వకు వెళుతుంటారు. రహదారి అభివృద్ధికి రూ.2.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అలాగే వదిలేశారు. రెండు మండలాలకు ఉపయోగకరంగా ఉన్న రహదారి అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం

కైకలూరు: నియోజకవర్గంలో రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. గోపాలపురం, వెంకటాపురం, పడమటిపాలెం, ఎస్ఆర్‌పీ అగ్రహారం, సానారుద్రవరం, భుజబలపట్నం గ్రామాల్లో నరేగా నిధులతో సీసీ రోడ్లను సోమవారం ప్రారంభించారు. అనంతరం వరహాపట్నం నివాసం వద్ద ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి కొవ్వాడలంక, పుట్లచెరువు, కొచ్చెర్ల గ్రామాలకు చెందిన ముగ్గురికి రూ.2,03,655 చెక్కులను పంపిణీ చేశారు.

జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై

ఘనంగా వినాయక నిమజ్జనాలు



శ్రీ సిద్ధి, బుద్ధి గణపతిగా స్వామి వారు

మొవ్వ: మండలంలో ఆరు రోజులుగా పూజలందుకుంటున్న గణనాథుడు నిమజ్జన ఊరేగింపులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రం ఎస్టీ కాలనీలో కాలనీ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి ఊరేగింపుని గులాం రంగులు, డప్పు వాయిద్యాల మధ్య ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మండల పరిధిలోని ప్రధాన కూడలి అయిన మొవ్వ, కూచిపూడి-పెదపూడి కూడళ్ల గణనాథుల విగ్రహాలతో కోలాహలంగా మారింది.

చవితి పందిళ్లలో దీపాల కళ

గుడ్లవల్లేరు: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుని మండలంలోని అన్ని గ్రామాల్లో నవరాత్రుల పందిళ్లు కళకళలాడుతున్నాయి. గుడ్లవల్లేరులో లక్ష వత్తులతో దీపార్చనలను చేపట్టారు. బాల వినాయక కమిటీ యువకులు వేడుకల్లో భాగంగా శ్రీ లక్ష్మీ మోటార్స్ అధినేత సీహెచ్.ఉపేంద్ర, స్వాతి దంపతుల ఆధ్వర్యంలో చిన్నారులతో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే శ్రీ విఘ్నేశ్వరా యూత్ వారు నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని స్వామిని శ్రీ సిద్ధి, బుద్ధి గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. సోమవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు.

గుర్రాల్లంకలో..

పమిడిముక్కల: గుర్రాల్లంక ఏటీఎం సెంటర్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఐదు రోజులు వైభవంగా పూజలు నిర్వహించారు. భారీ ఊరేగింపుతో, మేళతాళాలతో సోమవారం విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. యువకులు, చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో నెలకొల్పిన వినాయకుడి ప్రతిమను సోమవారం ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కైకలూరు: వదర్లపాడు రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు ఘంటసాల సురేష్ ఆధ్వర్యంలో వినాయక చవితి పందిరిలో విగ్రహానికి ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శింగంశెట్టి రాము, నాయకులు సమయం అంజి, తోట మహేష్, కన్నా రమేష్, పంజా నాగు, ఉండ్రమట్ల ఏసుకుమార్, మడకా శ్రీను, గుండాబత్తుల నాగు, పెరుగు వెంకన్న, శ్రీరామమూర్తి, మహేష్, ఏసు, చందు, నాగరాజు పాల్గొన్నారు.



మొవ్వలో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న గణనాథుడు



వదర్లపాడులో వినాయకుడి విగ్రహం వద్ద డీఎన్నార్ పూజలు



గుర్రాల్లంకలో గణేష్ విగ్రహం ఊరేగింపు



మండవల్లిలో నిమజ్జన ఊరేగింపు



గుడ్లవల్లేరులో దీపార్చనలు చేసిన భక్తులు

పాఠశాల తనిఖీ



ముదినేపల్లి రూరల్: ప్రాథమిక విద్యార్థుల మానసిక సామర్థ్యాలకు అనుగుణంగా సులభశైలిలో విద్యాబోధన చేయాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని చిగురుకోట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిరోజూ విద్యార్థుల నడవడిక, పుస్తక పఠనం, సంగ్రాహకశక్తిని అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని, పాఠశాల రికార్డులను పరిశీలించారు.


సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

ముదినేపల్లి రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం మండలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. వైఎస్సార్ విగ్రహాల వద్ద వర్ధంతి కార్యక్రమాలు జరపాలని పేర్కొన్నారు. ఇందుకు పార్టీ శ్రేణులు ముందుకు రావాలని కోరారు.

పింఛన్ల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండల వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. మండల వ్యాప్తంగా 9,120 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా వీటిలో 90 శాతం పైగా పింఛన్లను తొలిరోజే పంపిణీ చేసినట్లు మండల కార్యాలయ వర్గాలు తెలిపాయి.

3 నుంచి 10 వరకు రైల్వేగేట్ మూత



మండవల్లి: అత్యవసర మరమ్మతుల నిమిత్తం పుట్లచెరువు-పసలపూడి రైల్వే గేట్ మూసివేయనున్నట్లు కైకలూరు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గేట్ నంబరు 66కి 57-32 వద్ద ఈ నెల 3వ తేదీ నుంచి 10 వరకు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న కోలాటం



మండవల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండవల్లి వెలమపేటలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని సోమవారం నిమజ్జనం చేశారు. వెలంపేట యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో మురళీకోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెలమపేట యూత్ గురువు వీరాస్వామి ఆధ్వర్యంలో కోలాటాన్ని నేర్చుకుని ప్రదర్శించారు.

స్నేహితుడి కుమార్తెకు రూ.1,86,500 సాయం



కైకలూరు: పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడి కుమార్తె ఎంబీబీఎస్ చదువు నిమిత్తం రూ.1,86,500 ఫీజును సోమవారం చెల్లించారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1987-90 పదో తరగతి విద్యార్థులు బూరుబోయిన శ్రీనివాసరావు(బీఎస్సార్), తెంటు సతీష్, పెరుమాళ్ల మురళీకృష్ణ, సతీష్ మరికొందరు కలసి నగదును సమకూర్చారు. స్నేహితుడు ముంతా ప్రసాద్ కుమార్తెకు ఏలూరు ఆశ్రమం ఆస్పత్రిలో ఎంబీబీఎస్ సీటు రావడంతో ఫీజును స్నేహితులు చెల్లించారు.